సాక్షి
వికారాబాద్
మంగళవారం । 23 । జూలై । 2024



'మత్తు' వదిలిద్దాం

డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నగరానికే పరిమితమైన ఈ కల్చర్ నేడు జిల్లాను తాకింది. 8లో▸



బీసీ డిక్లరేషన్ ప్రకటించాలి

కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ డిక్లరేషన్‌ను వెంటనే ప్రకటించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు. 8లో▸



కొత్త రుణాల కోసం క్యూ

ప్రభుత్వం రుణమాఫీ చేసిన నేపథ్యంలో ధారూరు మండల రైతులు కొత్త రుణాల కోసం బ్యాంకుల బాట పట్టారు. 9లో▸

నేడు తాండూరు మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్ ఇన్

తాండూరు మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్రజల ఇబ్బందులు తదితర విషయాలపై ప్రజలకు ఫోన్ ఇన్ ద్వారా కమిషనర్ సలహాలు, సూచనలు ఇస్తారు.



అంశం : పారిశుద్ధ్యం, పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు
మున్సిపాలిటీ : తాండూరు
కమిషనర్ : విక్రమ్‌సింహారెడ్డి
తేదీ : 23-7-2024 (మంగళవారం)
సమయం : ఉదయం 11నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్లు :
98499 05909, 99852 23745

ఆదర్శంగా నిలుపుతాం

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



- పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చూస్తాం
- సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి
- సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన
- కొడంగల్ మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్
- 'సాక్షి' ఫోన్ ఇన్‌కు అనూహ్య స్పందన

కొడంగల్/ కొడంగల్ రూరల్: సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌ను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ అన్నారు. సోమవారం సాక్షి దినపత్రిక ఆధ్వర్యంలో కమిషనర్‌తో ఫోన్ ఇన్ కార్యక్రమంలో నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని ప్రజలు ఫోన్ ద్వారా వారి సమస్యలు వివరించారు. వాటిని పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ బలరాం నాయక్ 'సాక్షి'తో మాట్లాడారు. ప్రజలు తమ దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. వర్షాలు పడుతున్నందున ప్రజలు అంటు రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్ రెడ్డి సహకారంతో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తామని తెలిపారు. ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రశ్న: పాత కొడంగల్ శివారులోని ఎస్టీ గురుకుల పాఠశాలకు సరైన దారి లేదు. వర్షాకాలంలో పాఠశాలకు రావాలంటే ఇబ్బందిగా ఉంది. రోడ్డు సౌకర్యం కల్పించాలి.

– అరుణ, పాత కొడంగల్

కమిషనర్: కొడంగల్ చెరువు మరమ్మతులు, ఆధునీకరణ, ట్యాంక్ బండ్ నిర్మాణానికి రూ.45 కోట్లు మంజూరయ్యాయి. త్వరలో చెరువు కట్ట పైనుంచి రాకపోకలు సాగించడానికి రహదారి నిర్మాణం జరుగుతుంది. ఈ పనులు పూర్తయితే సమస్య ఉండదు.

ప్రశ్న: పట్టణంలోని గాంధీనగర్‌లో నీటి సమస్య ఉంది. మిషన్ భగీరథ నీరు సరిగ్గా రావడం లేదు.

– కృష్ణంరాజు, గాంధీనగర్

కమిషనర్: ఈ విషయంపై కడా ప్రత్యేకాధికారికి స్థానికులు ఫిర్యాదు చేశారు. తాగునీటి సమస్య లేకుండా చూడాలని మిషన్ భగీరథ అధికారులకు, నీటి సరఫరా విభాగం సిబ్బందికి సూచించాం.

ప్రశ్న: పాత కొడంగల్‌లోని మురుగు కాలువల్లో చెత్తాచెదారం నిండింది. వెంటనే తొలగించాలి.

– అల్తాఫ్, పాత కొడంగల్

కమిషనర్: మున్సిపల్ పరిధిలో ఆరు అనుబంధ గ్రామాలు ఉన్నాయి. ప్రతిరోజూ ఒక గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నాం. వర్షాకాలం కాబట్టి ప్రతి గ్రామంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం.

ప్రశ్న: పెద్ద చెరువు కట్టపై రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. అలుగు పారితే రాకపోకలు నిలిచిపోతాయి.

– బాలు, పాత కొడంగల్ తండా

కమిషనర్: చెరువు పనులు పూర్తయితే సమస్య ఉండదు. త్వరలో టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి పనులను ప్రారంభిస్తాం.

ప్రశ్న: పట్టణంలోని గాంధీనగర్‌లో దోమలు అధికంగా ఉన్నాయి. నివారణకు చర్యలు తీసుకోండి.

– సోమశేఖర్, గాంధీనగర్

కమిషనర్: దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తున్నాం. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ఫాగింగ్ చేయడం లేదు. వర్షాలు తగ్గిన వెంటనే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: పట్టణంలోని పలు కాలనీల్లో పారిశుద్ధ్యం లోపించింది. సమస్యను పరిష్కరించాలి.

– నందు, కొడంగల్

కమిషనర్: వర్షాలు కురవడం వల్ల మురుగు కాల్వలో చెత్త పేరుకుపోయింది. పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నాం. ప్రజలు రోడ్లపై చెత్త వేయరాదు. చెత్త సేకరణ వాహనాల్లోనే వేయాలి.

ప్రశ్న: కార్గిల్ కాలనీలో కాల్వలు లేకపోవడంతో మురుగు రోడ్లపై పారుతోంది. చర్యలు తీసుకోవాలి.

– రవీందర్ నాయక్, కార్గిల్ కాలనీ, కొడంగల్

కమిషనర్: మున్సిపల్ పరిధిలో మురుగు కాల్వలు, సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

ప్రశ్న: పట్టణంలోని బాలాజీనగర్‌లో కంప చెట్లు పెరిగి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. వాటిని తొలగించండి.

– బత్తుల నర్సింహ్మ, కొడంగల్

కమిషనర్: మున్సిపల్ సిబ్బందిని పంపి కంప చెట్లను తొలగిస్తారు. దోమల నివారణకు రసాయన మందులు పిచికారీ చేయిస్తాం.

ప్రశ్న: పట్టణంలోని మూడో వార్డులో ఇళ్లలోకి పాములు వస్తున్నాయి. పాడుబడిన ఇళ్లలో పాములు ఉంటున్నాయి. చర్యలు తీసుకోవాలి.

– బి.మోహన్, కొడంగల్

కమిషనర్: రసాయన మందులు పిచికారీ చేయిస్తాం. వర్షాకాలం కాబట్టి పాములు బయటకి వస్తాయి. జాగ్రత్తగా ఉండాలి.

ప్రశ్న: మంచినీరు కలుషితం అవుతోంది. ఆ నీటిని తాగితే ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి.

– దస్తప్ప, నాలుగో వార్డు, కొడంగల్

కమిషనర్: శ్రీశైలం నుంచి మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయి. వర్షాలు కురవడం వల్ల కొత్త నీరు వస్తోంది. తాగునీటి సరఫరాను మెరుగు పరచాలని మిషన్ భగీరథ అధికారులకు సూచించాం. త్వరలో ఈ సమస్య ఉండదు.

ప్రశ్న: బూల్కాపూర్, ఐనన్‌పల్లి గ్రామాల్లో రోడ్లపై చెత్త వేస్తున్నారు. దీంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

– వెంకటేశ్, ఐనన్‌పల్లి

కమిషనర్: పై గ్రామాలకు చెత్త సేకరణ వాహనాలు పంపిస్తున్నాం. వాటిలో చెత్త వేసేలా ప్రజలకు అవగాహన కల్పిస్తాం. చెత్త సేకరణకు ఆరు ఆటోలు, రెండు ట్రాక్టర్లు ఉన్నాయి.

ప్రశ్న: పట్టణంలో కుక్కలు, పందుల బెడద అధికంగా ఉంది. చర్యలు తీసుకోవాలి.

– రాములు, కొడంగల్

కమిషనర్: మున్సిపల్ పరిధిలో పందుల నివారణకు తగిన చర్యలు తీసుకున్నాం. వాటి యజమానులను పిలిచి అవగాహన కల్పించాం. పందులను షెడ్డులో పెంచుకోవాలని సూచించాం. కుక్కలను పట్టుకునేందుకు ఒక టీమ్ వస్తుంది.

ప్రశ్న: మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్‌లో వర్షం కురిస్తే కరెంటు కోత విధిస్తున్నారు. రాత్రి వేళల్లో అంధకారంలో ఉండాల్సి వస్తోంది. ప్రస్తుతం వర్షాకాలం కాబట్టి విష సర్పాలు బయటకు వస్తున్నాయి. వెంటనే చర్యలు తీసుకోవాలి.

– నజీర్, పాత కొడంగల్

కమిషనర్: ఈ సమస్యను విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

సాక్షి ఫోన్ ఇన్

ఇన్నోవేటర్‌కు దరఖాస్తుల ఆహ్వానం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, జిల్లా అధికారులు

- ఆగస్టు 3వ తేదీ వరకు అవకాశం
- కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: స్థానిక సమస్యలు పరిష్కరించే వినూత్న ఆవిష్కరణల రూపకల్పన కోసమే ప్రభుత్వం ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. సోమవారం తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..గృహిణి నుంచి పాఠశాలలు, కళాశాలల స్థాయి విద్యార్థులు, విద్యావేత్తలు, వ్యవసాయదారులు ఎవరైనా ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని తెలిపారు.స్థానిక సమస్యలను పరిష్కరించే వినూత్న ఆవిష్కరణలు పంపాల్సి ఉంటుందన్నారు. ఇందులో భాగంగా మీ పేరు, వయస్సు, ఫొటో, వృత్తి, చిరునామా, మండలం, జిల్లా, ఆవిష్కరణ పేరు, ఆవిష్కరణను వివరిస్తూ 100 పదాలలో వ్యాసం రాసి పంపాలన్నారు. ఆవిష్కరణలకు సంబంధించి నాలుగు ఫొటోలు, 2 నిమిషాల నిడివి గల వీడియో పంపాలన్నారు. వీటిని తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ వాట్సాప్ నంబర్ 91006 78543కు ఆగస్టు 3వ తేదీలోపు పంపించాలని సూచించారు. ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆవిష్కరణల ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, ఆర్డీఓ వాసుచంద్ర, ఇన్నోవేషన్ మిత్ర వినీత్ సిధార్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

జిల్లాస్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. మండల కేంద్రాలు, గ్రామాల్లో పర్యటించి అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులు, జరగాల్సిన పనుల వివరాలు తెలుసుకోవాలన్నారు. పెండింగ్ పనులను సత్వరం పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు.వివిధ ప్రాంతాలకు చెందిన 178 మంది సమస్యలపై దరఖాస్తు చేసుకున్నారు.అర్జీలను ఆయా శాఖల అధికారులకు బదలాయించి పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ సుధీర్,అదనపు కలెక్టర్ రెవెన్యూ లింగ్యానాయక్,ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, ఆర్డీవో వాసుచంద్ర, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఇబ్రహీంపట్నం రూరల్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రణయ్, బి.శంకర్ మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా విద్యార్థులకు చెల్లించాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ రూ.8,214 కోట్లు విడుదల చేయకుండా కాలయాపన చేయడం తగదన్నారు. జిల్లాలో సుమారు రూ.730 కోట్ల బకాయిలు ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తామని మాటలకే పరిమితమైందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా ఉలుకుపలుకూ లేదని విమర్శించారు. విద్యారంగానికి అసెంబ్లీ సమావేశాల్లో 30 శాతం నిధులు కేటాయించాలని, ఖాళీగా ఉన్న ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆమనగల్లు ప్రాంతంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పడి 23 ఏళ్లు గడుస్తున్నా నేటికీ సొంత భవనం లేదని, చెట్ల కింద చదువులు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేసేవరకు పోరాటం ఆపేది లేదన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చరణ్, శివ, శ్రీకాంత్, తరంగ్, సహాయ కార్యదర్శులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పనుల్లో వేగం పెంచండి

- సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్
- వికారాబాద్, నారాయణపేట కలెక్టర్లతో సమీక్ష



అభివృద్ధి పనులపై చర్చిస్తున్న సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్

కొడంగల్ రూరల్: వికారాబాద్, నారాయణపేట జిల్లాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యదర్శి మాణిక్‌రాజ్ సోమవారం సమీక్ష నిర్వహించారు. పట్టణంలోని కడా కార్యాలయంలో ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రతీక్ జైన్, సిక్తా పట్నాయక్, వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. రెండు జిల్లాల తోపాటు నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. పనుల్లో వేగం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో వికారాబాద్, నారాయణపేట అదనపు కలెక్టర్లు ఉమాహారతి, మయాంక్ మిట్టల్, గరిమ నరుల, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టార్ స్పోర్ట్స్ క్విజ్ విజేత అంకిత్‌రావు

దోమ: స్టార్ స్పోర్ట్స్ చానల్ నిర్వహించిన ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలో దోమ మండల కేంద్రానికి చెందిన విద్యార్థి గౌర్వార్ అంకిత్‌రావు విజేతగా నిలిచాడు. ఇటీవల జరిగిన టీ–20 వరల్డ్ కప్ సమయంలో స్టార్ స్పోర్ట్స్ చానల్ విద్యార్థులకు ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలను నిర్వహించింది. దోమ జెడ్పీహెచ్ఎస్‌లో 8వ తరగతి చదువుతున్న అంకిత్‌రావు ఈ పోటీలో పాల్గొన్నాడు. విజేతగా నిలవడంతో సోమవారం చానల్ నిర్వాహకులు రూ.30 వేల విలువ చేసే ఎయిర్ ప్యూరి ఫైయిర్‌ను బహుమతిగా పంపారు. విద్యార్థి అంకిత్‌రావును పాఠశాల సిబ్బంది, స్థానికులు అభినందించారు.



ఎయిర్ ప్యూరిఫైయిర్‌తో విద్యార్థి అంకిత్‌రావు



నర్సరీల యజమానులకు నోటీసులు అందజేస్తున్న అధికారులు

నర్సరీలకు అనుమతులు తప్పనిసరి

- లేకుంటే చర్యలు
- హార్టికల్చర్ ఆఫీసర్ అర్చన

ధారూరు: అనుమతులు లేకుండా కూరగాయల నారు నర్సరీలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హార్టికల్చర్ వికారాబాద్ నియోజకవర్గం ఆఫీసర్ అర్చన హెచ్చరించారు. ధారూరులోని వేంకటేశ్వర, లక్ష్మి వెజిటబుల్స్ నర్సరీల నుంచి కొనుగోలు చేసిన నారు నాటడంతో తాము నష్టపోయామని మండలంలోని రాంపూర్ తండాకు చెందిన గిరిజనులు ఫిర్యాదు చేయడంతో ఆమె సోమవారం తనిఖీలకు వచ్చారు. సంబంధిత నర్సరీలను పరిశీలించి అనుమతులు లేకపోవడంతో వాటి యజమానులకు నోటీసులు అందజేశారు. అంతకుముందు ఫిర్యాదు చేసిన రైతుల మిరప పంటను పరిశీలించారు.మిరప కాయలు కారం లేకపోవడంతో ప్రజలు కొనుగోలు చేయడం లేదని,దీంతో ఆర్థికంగా నష్టపోయామని బాధిత రైతులు అధికారి దృష్టికి తెచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..కూరగాయల నారు నర్సరీలు ఏర్పాటు చేయాలంటే ఉద్యానవన శాఖ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. వేంకటేశ్వర, లక్ష్మి వెజిటబుల్స్ నర్సరీలకు అనుమతులు లేవన్నారు. దీంతో నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు.రైతుల నష్టాలకు నర్సరీల యజమానులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

దివ్యాంగులను కించపరచడం సరికాదు

- ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు భుజంగరెడ్డి

షాద్‌నగర్: ఆలిండియా సర్వీసుల్లో దివ్యాంగుల కోటాపై ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ దివ్యాంగులను కించపరిచేలా మాట్లాడటం సరికాదని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగరెడ్డి అన్నారు. ఆమె చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం షాద్‌నగర్ పట్టణ చౌరస్తాలో ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో దివ్యాంగులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన భుజంగరెడ్డి మాట్లాడుతూ.. ఉన్నత హోదాలో ఉన్న స్మితా సబర్వాల్ దివ్యాంగులను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం బాధాకరమని అన్నారు. దివ్యాంగులకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చేగూరి శేఖర్‌గౌడ్, సంతోష, విజయభారతి, మనీలా, సువర్ణ, అంజయ్య, అనుసూయ, యాదయ్య పాల్గొన్నారు.



షాద్‌నగర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు

వనమహోత్సవం.. తాత్సారం

- వానాకాలం ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా నాటింది 25శాతం మొక్కలే..
- ఈ ఏడాది లక్ష్యం 40,48,500
- 19 ప్రభుత్వ శాఖలకు బాధ్యతలు.. దూరంగా సగం శాఖలు



పరిగి మండలం బసిరెడ్డిపల్లి నర్సరీలో పెంచుతున్న మొక్కలు

వికారాబాద్: జిల్లాలో వనమహోత్సవం కార్యక్రమం నత్తను తలపిస్తోంది. గత ప్రభుత్వం హరిత హారం పేరుతో నిర్వహించిన కార్యక్రమాన్ని ప్రస్తుత సర్కారు వనమహోత్సవం పేరుతో నిర్వహిస్తోంది. వానాకాలం ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా 25 శాతంలోపు మొక్కలే నాటారు. కొన్ని శాఖలు 30 శాతం లక్ష్యాలను పూర్తి చేయగా సగం శాఖలు ఇంకా ప్రారంభించలేదు. ఈ ఏడాది 40,48,500 మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టుకున్నారు. మొదట్లో వర్షాలు పడక కార్యక్రమం ముందుకు సాగలేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నా మొక్కలు నాటే ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. వనమహోత్సవ కార్యక్రమం విజయవంతం కోసం 19 ప్రభుత్వ శాఖలను భాగస్వాములు చేశారు. శాఖల వారీగా లక్ష్యాలను నిర్దేశించారు. అటవీ, గ్రామీణాభివృద్ధి శాఖల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు.

బాధ్యతలు అప్పగించినా..

జిల్లాలో ఈ ఏడాది 40,48,500 మొక్కలను నాటాలని లక్ష్యం పెట్టుకున్నారు. గత ఏడాది నాటిన వాటిలో 80శాతం వరకు మొక్కలు బతికాయని అధికారులు చెబుతున్నా వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. కేవలం 50 నుంచి 60 శాతం మొక్కలు మాత్రమే బతికినట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో తెలుస్తోంది. ఈ ఏడాది 40,48,500 మొక్కలకు గాను ఇప్పటి వరకు 10,0,76,40 మొక్కలు మాత్రమే నాటారు. పశు సంవర్ధక శాఖ, మైనింగ్, సివిల్ సప్లయ్, పోలీసు, ఆర్అండ్‌బీ, డీబ్ల్యూఓ, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీలు తదితర ప్రభుత్వ శాఖలు ఇంకా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

సిద్ధంగా మొక్కలు

జిల్లా వ్యాప్తంగా అటవీ, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో 581 నర్సరీల్లో 38,30,000 మొక్కలను పెంచుతున్నారు. టేకు మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారు. గ్రామ పంచాయతీల్లోని ఒక్కో నర్సరీలో 5వేల చొప్పున 28,30,000 మొక్కలు, 15 ఫారెస్టు నర్సరీల్లో 10 లక్షల మొక్కలు పెంచుతున్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామ పంచాయతీలు 25లక్షల మొక్కలను నాటాల్సి ఉంది. అటవీశాఖ 5లక్షల మొక్కలు, విద్యాశాఖ 11 వేలు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ 9,43, 500, ఉద్యానవన శాఖకు 2 లక్షలు, వ్యవసాయ శాఖ 5 లక్షలు, తాండూరు మున్సిపాలిటీ 70 వేలు, వికారాబాద్ మున్సిపాలిటీ 80 వేలు, కొడంగల్ మున్సిపాలిటీకి 35 వేలు, పరిగి మున్సిపాలిటీ 30 వేలు మొక్కలు నాటాల్సి ఉంది. అయితే అప్పటి వరకు 25శాతం మొక్కలు కూడా నాటక పోవడం అధికారుల పని తీరుకు అద్దం పడుతోంది.

పిల్లల్లో లోపాల గుర్తింపునకు 'బాల స్వాస్థ్య'



పీహెచ్‌సీలో తనిఖీలు నిర్వహిస్తున్న పల్వన్‌కుమార్

- పైలెట్ ప్రాజెక్టుగా బొంరాస్‌పేట మండలం ఎంపిక
- జిల్లా వైద్యాధికారి పల్వన్‌కుమార్

బొంరాస్‌పేట: పిల్లల పుట్టుకతో వచ్చే లోపాలు, వంశపారంపర్యంగా, పెరుగుదల లోపాలు గుర్తించడానికి బాల స్వాస్థ్య కార్యక్రమం చేపట్టనున్నట్లు జిల్లా వైద్యాధికారి పల్వన్‌కుమార్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 0నుంచి 18సంవత్సరాలు ఉన్న పిల్లల్లో లోపాలను గుర్తించడం కోసం బొంరాస్‌పేట మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంపై ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీలకు సంపూర్ణ అవగాహన ఉండాలన్నారు. అందులో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఒక్క రోజు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. పీహెచ్‌సీకి వచ్చే రోగుల పట్ల వైద్యులు, సిబ్బంది సానుకూలంగా ఉండాలని సూచించారు. రోగులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవల్లో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా సహించేది లేదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎం హెచ్ఓ డాక్టర్ రవీంద్ర యాదవ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తల్లి జ్ఞాపకార్థం అడ్వకేట్స్‌కు పుస్తకాలు



పుస్తకాలు అందజేస్తున్న శ్రీనివాస్ యాదవ్

పరిగి: పరిగి బార్ అసోసియేషన్‌లోని న్యాయవాదులకు సోమవారం కొత్త చట్టాల సవరణ క్రిమినల్ మేజర్ యాక్ట్ పుస్తకాలు పంపిణీ చేశారు. హైకోర్టు న్యాయవాది రాపోల్ భాస్కర్ తల్లి జ్ఞాపకార్థం ఈ పుస్తకాలు అందజేసినట్లు వివరించారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. ఈ పుస్తకాలు న్యాయవాదులకు ఎంతో ఉపయోగకరమన్నారు. అనంతరం కొత్తగా నియమితులైన ఏపీపీ గోపాల్‌ను, ఏజీపీ బాలముకుందంను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి భక్తకుమార్, అలీమొద్దీన్, రాజేందర్‌గౌడ్, లింగం, దామోదర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, వెంకట్‌రాములు, ఇబ్రాహీం, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడువు ముగిసినా నివేదిక సమర్పించలేదు

మంచాల: పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా ప్రభుత్వం చెల్లించే కరువుభత్యం(డీఏ) పెంచాలని ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఏవీ సుధాకర్ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. డీఏ రెండున్నరేళ్లుగా ప్రభుత్వం పెంచడం లేదని ఆయన పేర్కొన్నారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న డీఏలను చెల్లించాలన్నారు. పీఆర్సీ గడువు ముగిసి ఈ నెలతో ఏడాది కావొస్తుందని సంబంధిత కమిటీ మాత్రం ప్రభుత్వానికి నివేదిక సమర్పించ లేదని వాపోయారు. ప్రతి నెలా మొదటి తారీఖున వేతనాలు చెల్లిస్తున్న ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్సీల గురించి మంత్రి మండలి సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



దుండగులు ధ్వంసం చేసిన బీరువా

ఇబ్రహీంపట్నం: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన సంఘటన ఇబ్రహీంపట్నం ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక కేవీ తండాలో నివాసముండే శ్రీనివాస్ ఇంటికి తాళం పెట్టి తన అక్క వద్దకు ఆదివారం వెళ్లారు. తిరిగి మరుసటి రోజు ఉదయం శ్రీనివాస్ ఇంటికి రాగా.. సామగ్రి చిందరవందరగా పడి ఉంది. బీరువా తాళాలు పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. తులం బంగారం, 50 తులాల వెండి ఆభరణాలతోపాటు కొంత నగదును తస్కరించినట్లు ఆయన తెలిపారు. సోమవారం ఉదయం శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

విమానం ఆలస్యం.. ప్రయాణికుల ఆందోళన

శంషాబాద్: విమానం ఆలస్యం కావడంతో ప్రయాణికులు ఆందోళన చేసిన సంఘటన శంషాబాద్ ఎయిర్‌పోర్టులో చోటు చేసుకుంది. సోమవారం ఉదయం ఐదుగంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఢిల్లీ వెళ్లాల్సిన విమానం సమయానికి బయలుదేరలేదు. ఉదయం 8 గంటల వరకు కూడా విమానం బయలుదేరకపోవడంతో ప్రయాణికులు ఎయిర్‌లైన్స్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు తెలిపాయి.

ఆకతాయిలపై కేసు

ఆమనగల్లు: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం సాయంత్రం స్కూల్ విద్యార్థినులను ఈవ్ టీజింగ్ చేస్తున్న ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఆమనగల్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు. బస్టాండ్ ఆవరణలో ఉన్న పాఠశాల విద్యార్థులను కొందరు యువకులు ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్నారని సమాచారంతో బస్టాండ్‌కు వెళ్లి వాళ్లను అదుపులోకి తీసుకున్నామన్నారు. ముగ్గురి యువకులపై కేసు నమోదు చేశామని అనంతరం వారి తల్లిదండ్రులను పోలీసు స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించామన్నారు. విద్యార్థినులను, యువతులను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

మత్తు వదిలిద్దాం

డ్రగ్స్ కట్టడికి ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టేందుకు సిద్ధమైంది. ఇప్పటికే పోలీసు శాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా దాడులు కొనసాగుతున్నప్పటికీ ఈ కల్చర్ నగరం నుంచి పల్లెలకు చేరింది. దీంతో మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించే పనిలో నిమగ్నమైంది.

- డ్రగ్స్ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు
- జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీలు
- పాఠశాల విద్యార్థులను భాగస్వామ్యం చేసేందుకు కసరత్తు



తాండూరు: డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. హైదరాబాద్ నగరంతో పాటు శివారు ప్రాంతాలకే పరిమితమైన ఈ కల్చర్ జిల్లాను తాకింది. జిల్లాలోని ఫాంహౌస్‌లు, రిసార్ట్‌లు ఇందుకు వేదికలుగా మారాయి. గంజాయి రవాణాకు అడ్డుకట్ట పడకపోవడంతో గంజాయి సేవించే వారి సంఖ్య పెరుగుతోంది. విద్యార్థులు సైతం పాఠశాల స్థాయి నుంచే ధూమపానం, గంజాయికి బానిసలవుతున్నారు. ప్రతీ నెలలో డ్రగ్స్ సరఫరా చేసేవారు పట్టుబడుతున్నారంటే ఈ పరిస్థితి ఎంత తీవ్రరూపం దాల్చిందో ఇట్టే అర్థమవుతోంది. మత్తులో నేరాలు చేసే వారి సంఖ్య పెరగడం ఆందోళన కలిగించే అంశం.

పట్టణ శివారులో అడ్డాలు

ఇటీవల పట్టణ శివారులో వెలిసిన టీ స్టాల్స్ మత్తు పదార్థాలతో పాటు ధూమపానం సేవించే అడ్డాలుగా మారాయి. ఈ నెల 12న ఓ యువకుడు మత్తులో వీరంగం సృష్టించాడు. మత్తు మైకంలో పట్టణ ప్రజలపై దాడికి యత్నించగా స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పేరు, గ్రామం పేరు చెప్పకపోవడంతో సదరు యువకుడు డ్రగ్స్ సేవించాడని పలువురు చర్చించుకుంటున్నారు.

ప్రత్యేక కమిటీలు

మత్తు పదార్థాలకు బానిసలుగా మారిన యువతను దారిలో పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎక్సైజ్, పోలీసు శాఖలు మత్తు పదార్థాలను శాశ్వతంగా నిర్మూలించేందుకు చర్యలు చేపట్టారు. అందుకు పాఠశాల స్థాయి నుంచి కళాశాల స్థాయి విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలన కమిటీలలో భాగస్వామ్యం కల్పిస్తూ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. అందుకోసం ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు. ప్రాథమికోన్నత పాఠశాల నుంచి ఉన్నత పాఠశాల్లో ప్రతీ తరగతిలో ఒక్కో కమిటీ ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఎక్సైజ్ పోలీసులు, పోలీసులు కమిటీలో సభ్యులుగా కొనసాగనున్నారు. పాఠశాలల్లో ఎవరైనా ధూమపానం, మద్యపానం లాంటి వాటికి జోలికి వెళ్తే ఈ కమిటీ వారిని దారిలో పెట్టనుంది. మరోవైపు మండల, నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయిలో ఈ కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. వచ్చే నెలలో ఈ కమిటీలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు పేర్కొంటున్నారు.

అవగాహన కల్పిస్తాం



మత్తు పదార్థాల నిర్మూలకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయనున్నాం. పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు కమిటీలు ఏర్పాటు చేయనున్నాం. ప్రతీ గ్రామంలో మత్తు పదార్థాలను అరికట్టేందుకు ప్రజలను చైతన్యంచేసేందుకు కార్యక్రమాల రూపకల్పన చేస్తున్నాం. ఎక్సైజ్ శాఖతో పాటు పోలీసు, రెవెన్యూ శాఖలు, పంచాయతీ అధికారుల సమన్వయంతో యువతకు, విద్యార్థులకు, ప్రజలకు మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తాం.

– బాలగంగాధర్, ఎక్సైజ్ సీఐ, తాండూరు

బీసీ డిక్లరేషన్ ప్రకటించాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌కుమార్

తాండూరు రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ డిక్లరేషన్‌ను వెంటనే ప్రకటించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యూ.రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బొప్పి శ్రీహరి ఆధ్వర్యంలో తాండూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల హామీ మేరకు కులగణన చేపట్టి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని అధికారం దక్కాక పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీసీ సబ్‌ప్లాన్‌కు తగిన నిధులు విడుదల చేస్తామని నేటికీ ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. ఎంబీసీ కులాలకు ప్రత్యేక సంక్షేమ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాని కోరారు. అనంతరం తహసీల్దార్ తారాసింగ్‌కు వినతిపత్రంను అందజేశారు. నాయకులు బాలేశ్వర్ గుప్తా, కృష్ణ ముదిరాజ్, రజనీకాంత్, శివ కుమార్, లలిత, శాంతకుమార్, బాలప్ప, మల్లేశం, భద్రేశ్వర్, భాను ప్రసాద్, కిరణ్, ప్రభాకర్‌గౌడ్, శ్రీకాంత్, శివ, సాయిలు తదితరులున్నారు.

హామీలు అమలు చేసేవరకు పోరాటం

పరిగి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు పోరాడుతామని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ నర్సింహ అన్నారు. సోమవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి పట్టణ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున్‌కు వినతిపత్రం అందజేశారు. ఆరు నెలల్లోనే బీసీ కమిషన్ ఆధారంగా రిజర్వేషన్లు పెంచుతామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాలయాపన చేయడం తగదన్నారు. బీసీ రిజర్వేషన్‌ను 23 శాతం నుంచి 42శాతానికి పెంచుతామని హామీ ఇచ్చి మరిచారన్నారు. బీసీ ఓట్లతో గద్దెనెక్కిన సర్కారు బీసీలకు అన్యాయం చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రాముయాదవ్, కేశవులు, ఓబీసీ మోర్చా జిల్లా నాయకులు శ్రీశైలం, బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తాండూరు రూరల్: తహసీల్దార్ తారాసింగ్‌కు వినతిప్రతం అందజేస్తున్న బీజేపీ శ్రేణులు

పేరుకే నిషేధం!

- దొడ్డి దారిన గడ్డి మందు అమ్మకం
- కర్ణాటకలో ఖరీదు.. ఇక్కడ విక్రయం

పెద్దేముల్: ప్రభుత్వం నిషేధించిన గడ్డి మందు అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఆహార పంటలకు విషతుల్యం.. వ్యవసాయ భూమిని నిస్సారం చేసే కలుపు మందు వాడకం పెరగడంతో డిమాండ్ విపరీతమైంది. కర్ణాటక సరిహద్దు సమీపంలో ఉండడంతో ఎరువుల దుకాణాల యజమానులు పెద్ద ఎత్తున తీసుకొచ్చి విక్రయాలు చేస్తున్నారు. మరి కొంత మంది వ్యవసాయ పొలాల్లో, తమకు తెలసిన వారి ఇళ్లలో భద్రపరిచి విక్రయాలు చేస్తున్నట్లు సమాచారం. విషయం తెలిసినా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు సైతం ఉన్నాయి.

రూ.420కి కొనుగోలు

మండల పరిధిలోని మంబాపూర్, ఇందూరు, పెద్దేముల్, తట్టెపల్లి తదితర గ్రామాలల్లో ఎరువుల దుకాణాలున్నాయి. పత్తి, కందితో పాటు వివిధ రకాల సాగు చేసిన పంటలకు రైతులు పురుగు మందు అధికంగా కొనుగోలు చేస్తారు. పొలాలను నిస్సారం చేస్తున్న కలుపు మందు వాడకంపై రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితం నిషేధం విధించింది. ఎరువుల దుకాణాల యజమానులు కర్ణాటక రాష్ట్రం కుంచారం, చించోలి, సేడం, గుల్బర్గా ప్రాంతాల నుంచి గడ్డి మందు కొనుగోలు చేసి తీసుకువన్నారు. లీటర్‌కు రూ.200 అదనపు ధరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. తప్పక అవసరమున్న



రైతులు చేసేదేం లేక కొనుగోలు చేస్తున్నారు. వివిధ రకాల పేర్లతో విక్రయాలు కొనసాగుతున్నా వ్యవసాయ శాఖ దృష్టి సారించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. పొరుగు రాష్ట్రాల్లో లీటర్‌కు రూ.420 చొప్పున ఖరీదు చేసి ఇక్కడ రైతులకు రూ.500 నుంచి రూ.600కు తగ్గకుండా విక్రయిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

లైసెన్స్‌లు రద్దు



నిషేధిత గడ్డి మందును విక్రయించే ఎరువుల దుకాణాల యజమానుల లైసెన్స్‌లు రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో ఎవరైనా విక్రయిస్తే తమకు సమాచారం అందించాలి. ప్రభుత్వం నిర్ణయించిన మందులే విక్రయాలు చేయాలి.

– నజీరుద్దీన్, ఏఓ, పెద్దేముల్

పంచాయతీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ

తాండూరు టౌన్: గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర గ్రామ పంచా యతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం తాండూరు ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం ఆర్డీఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఏడు నెలలుగా పెండింగ్ వేతానా న్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ విధానం రద్దు చేసి సిబ్బందిని పర్మినెంట్ చేయాలని.. కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని కోరారు. కారోబార్, బిల్ కలెక్టర్‌లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని, జీఓ నెంబర్ 51ని సవరించాలని, మరణించిన సిబ్బంది కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా, గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ఈ నెల 30న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించి నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కార్మిక సంఘం నాయకులు జిలాని, నర్సింలు, శాంతమ్మ, వెంకటమ్మ, భీమయ్య, అంబరప్ప, రాములు, షబ్బీర్, శ్యామప్ప, చందు, లక్ష్మి, హరి, వెంకటప్ప, భీమమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

గుర్తు తెలియని వాహనం ఢీ
వ్యక్తి దుర్మరణం

పరిగి: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సయ్యద్ మల్కాపూర్ సమీపంలో చోటు చేసుకుంది. సోమవారం ఎస్ఐ సంతోశ్ వివరాలు వెల్లడించారు. అస్సాం రాష్ట్రం ఉదలేగురి జిల్లా కుచురబరి గ్రామానికి చెందిన పరిమలే శీల శర్మ(48) లక్ష్మీదేవిపల్లి సమీపంలోని సుగుణ స్టీల్ ఫ్యాక్టరీలో ఏడాది నుంచి హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం పరిగి పట్టణంలో కూరగాయాలు కొనుగోలు చేసి వస్తుండగా మహీంద్ర ట్రాక్టర్ షోరూం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆయన తలకు బలమైన గాయాలవ్వడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి బంధువు లగనేసాయ్‌పానికా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న రైతు మృతి

దోమ: చికిత్స పొందుతున్న కౌలు రైతు మృతి చెందాడు. ఈ ఘటన దోమ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన అనంతయ్య(62) పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఈ నెల 13న పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ జంపర్లు కొట్టేశాయి. వాటిని సరిచేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన వారు కుటుంబీకులకు సమాచారం అందించడంతో వికారాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో నగరంలోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతున్న ఆయన ఆదివారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు హన్మంతు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చండి

రాష్ట్ర ఆర్గనైజ్ సెక్రటరీ చంద్రయ్యముదిరాజ్, జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌ముదిరాజ్



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ముదిరాజ్ మహాసభ నాయకులు

కందుకూరు/మొయినాబాద్‌రూరల్: ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి ఏ గ్రూప్‌లో చేర్చాలని కోరుతూ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఆర్గనైజ్ సెక్రటరీ కర్రోళ్ల చంద్రయ్యముదిరాజ్, జిల్లా అధ్యక్షుడు బైరమోని మల్లేశ్‌ముదిరాజ్ మాట్లాడారు. ముదిరాజ్ హక్కుల కోసం కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ నిరంతరం పోరాటం చేసి ఆనాటి ఉమ్మడి ముఖ్యమంత్రి వైఎస్ఆర్ ప్రభుత్వంలో ముదిరాజ్‌ల స్థితిగతులపై అధ్యయనం చేయించారన్నారు. బీసీ ఏ గ్రూప్‌నకు మారుస్తూ జీఓ నంబర్ 15 జారీ చేశారన్నారు. కొంత మంది కోర్టుకు వెళ్లడంతో ఆనాడు జీఓ అమలుకు నోచుకోలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆ జీఓను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం యూత్ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌ముదిరాజ్, జిల్లా కార్యదర్శి కృష్ణముదిరాజ్, నాయకులు బాబురావుముదిరాజ్, అంజయ్యముదిరాజ్, సురేందర్‌ముదిరాజ్, శ్రీలతశ్రీహరిముదిరాజ్, గణేష్‌ముదిరాజ్, రాములుముదిరాజ్, భిక్షపతి ముదిరాజ్, వెంకటేష్, జంగయ్య, యాదయ్య, సతీష్‌చంద్ర, రమేష్, ఉదయ్, లింగం, సుదర్శన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

బీసీల హామీలు మరిచిన ప్రభుత్వం



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి

హుడాకాంప్లెక్స్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో బీసీలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆరోపించారు. ఈ మేరకు సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశం వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడ్డ ఆరు నెలలలోపే కులగణన చేసి కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచి, స్థానిక సంస్థల్లో ఉన్న బీసీ రిజర్వేషన్లు 23 నుంచి 42 శాతానికి పెంచుతామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. అదే విధంగా గొల్ల కురుమలకు అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రెండో దశ గొర్రెల పంపిణీకి రూ.రెండు లక్షలు లబ్ధిదారుని ఖాతాల్లో వేస్తామన్నారని మోసం చేశారని, ఎంబీసీ కులాలకు ప్రత్యేక సంక్షేమ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేస్తామని చేయలేదన్నారు. రాష్ట్రంలోని మత్స్య సంఘాలకు చేప పిల్లలు పంపిణీ చేయలేదన్నారు. ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలపై వారం రోజుల్లోగా స్పష్టత ఇవ్వకపోతే అన్ని జిల్లా కలెక్టరేట్ల ముందు ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో కార్పొరేటర్ మహేశ్వర్‌రెడ్డి, నాయకులు సురేందర్‌యాదవ్, సంజయ్, మురళీ, ప్రశాంత్‌ముదిరాజ్, శ్రీనివాస్, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి భవనం నిర్మించాలని వినతి

తలకొండపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి(పీహెచ్‌సీ) నూతన భవనం నిర్మించాలని టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీహెచ్‌సీ భవనం పూర్తిగా శిథిలమై పోయిందన్నారు. వర్షాలకు పైకప్పుపై నీరు నిలిచి భవనం కూలిపోయే ప్రమాదముందని మంత్రికి విన్నవించారు. అంతేగాకా భవనం లీకేజీలతో ఆస్పత్రిలోకి నీరు వస్తోందని, దీంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. నిధులు మంజూరు చేసి నూతన భవనం నిర్మించాలని మంత్రిని కోరారు.



మంత్రి దామోదర రాజ నర్సింహకు వినతిపత్రం అందిస్తున్న లక్ష్మీనివాస్

వేతనాలు వెంటనే చెల్లించండి

ఆదర్శ పాఠశాలలో పనిచేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

చేవెళ్ల: రాష్ట్రంలో ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న తమకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్, అదనపు కలెక్టర్లను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చాలిచాలని తక్కువ వేతనాలతో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు నెలల తరబడి రాకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. నెలనెల వచ్చే వేతనంపైనే ఆధారపడి పనిచేస్తున్న వారికి కుటుంబభారం కష్టంగా మారుతుందన్నారు. పిల్లల చదువులు, ఫీజులు, కుటుంబాన్ని కొనసాగించేందుకు ఆధారమైన వేతనాలు పెండింగ్‌లో ఉంటే మా పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ స్పందించి విద్యాశాఖ అధికారులకు సమస్యను పరిష్కరించాలని ఆదేశించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగులు ఆంజనేయులు, శేఖర్, రాజేందర్‌రెడ్డి, నవనీత, వేదప్రకాష్, రాధాకృష్ణ, శివ, ఉపేందర్, జంగయ్య, మల్లేశ్, యాదయ్య, నర్సింలు ఉన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

అంతా అక్రమమే..

- ఫామ్ హౌస్ కూల్చివేసిన మున్సిపల్ అధికారులు
- 8 బోన్లలో..14 కుక్కల గుర్తింపు
- బాతులు, కోళ్లు కూడా

శంషాబాద్: ఇటీవల సంచలనం రేపిన ఎమ్మార్పీఎస్ నేతలు నరేందర్, ప్రవీణ్‌లను కిడ్నాప్ చేసి బంధించిన ఫాంహౌస్‌ను సోమవారం పోలీసుల బందోబస్తు మధ్య శంషాబాద్ మున్సిపాలిటీ అధికారులు నేలమట్టం చేశారు. పట్టణంలోని 103 సర్వే నంబరులో ధర్మగిరి ఆలయానికి సమీపంలో కిడ్నాపర్లు సుమారు వెయ్యి గజాల స్థలంలో ఈ ఫాంహౌస్‌ను నిర్మించినట్లు గుర్తించారు. రెండు మూడేళ్ల క్రితం ఎలాంటి అనుమతులు లేకుండా రెండు రేకుల షెడ్‌లతో పాటు ప్రహరీ, కుక్కలను ఉంచేందుకు ఎనిమిది బోన్లను ఏర్పాటు చేశారు. బాతులు, కోళ్లను పెంచుతున్నారు. కిడ్నాప్ సంఘటనతో అప్రత్తమైన పోలీసులు ఫాంహౌస్‌లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్న గుర్తించి మున్సిపల్ అధికారులకు సమాచారం అందించారు. అక్రమ నిర్మాణంగా తేలితే కూల్చివేయాలని సూచించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు ఆదేశాలతో టౌన్‌ప్లానింగ్ అధికారులు ఇటీవల ఫాంహౌస్‌కు నోటీసులు అంటించారు. సోమవారం కూల్చివేతలు చేపట్టారు. కుక్కలతో పాటు, కోళ్లు, బాతులను తీసుకెళ్లేందుకు పశుసంవర్ధక శాఖ, బ్లూక్రాస్‌కు సమాచారం అందించారు. ఫాంహౌస్ అక్రమ నిర్మాణమేనని అధికారులు స్పష్టం చేస్తున్నా రు. కాగా కూల్చివేతల సమయంలో సంబంధిత వ్యక్తులు ఎవరూ అక్కడికి రాలేదు. ఓ వ్యక్తి అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వివాదాస్పద భూమి..

పట్టణంలోని 103 సర్వే నంబరులో వందల ఎకరాల్లో పట్టాదారులు, ప్రభుత్వానికి మధ్య హైకోర్టులో కేసు నడుస్తోంది. ప్రభుత్వ రికార్డుల్లో సర్కారు భూమిగా ఉన్నప్పటికీ ఎన్నో ఏళ్లుగా రైతులు సాగు చేసుకుంటుండటంతో పాటు గతంలో పట్టాపాస్‌బుక్కులు కూడా ఉండడంతో రైతులకు, ప్రభుత్వానికి మధ్య వివాదం నడుస్తోంది. సమస్య పరిష్కారం కాకపోవడంతో ప్రభుత్వ భూమిగానే పరిగణించాల్సిన అధికారులు ఫాంహౌస్‌లు నిర్మించినా పట్టించుకోకపోవడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సదరు నిర్మాణదారులు కనీసం పట్టాదారులు కూడా కాకపోవడం గమనార్హం.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం..

భూ కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ హెచ్చరించారు. భూ కబ్జాదారులు ఇబ్బంది పెడితే పోలీసులను సంప్రదించాలన్నారు.